క్లుప్తంగా

బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం: ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లలో బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నారాయణరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్ రాయుళ్లు బెట్టింగ్‌లకు పాల్పడకుండా ఆదిలోనే క్లాంం వేసే దిశగా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఈ వ్యవహారంలో యువత, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు మైనర్లు చిక్కుకుపోతున్నారని అత్యాశకు పోయి అప్పులపాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎక్కడైనా బెట్టింగులు జరుగుతున్నట్లుగాని పేకాట శిబిరాలు నిర్వహించినట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్ఐ వి.ప్రసాదరావు ఉన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు



బోరు బాగు చేస్తున్న సిబ్బంది

వంగర: మండల పరిధి శ్రీహరిపురం, శ్రీహరిపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఆరు తాగునీటి బోర్లును బుధవారం మరమ్మతులు చేపట్టారు. క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా ఇటీవల మరమ్మతులకు గురైన బోర్లును బాగుచేసి తాగునీటిని సరఫరా చేశారు. కార్యక్రమంలో బోర్ మెకానిక్‌లు కళింగ కృపారావు, వెంకటరమణ, రామకృష్ణ తదితరులున్నారు.

15 రోజుల్లో బహిరంగ వేలం



ఆలయం వద్ద బోర్డు పాతిన అధికారులు

సంతకవిటి: మండలంలోని సిరిపురం గ్రామంలో వెలసిన కొండకామేశ్వర ఆలయం దేవదాయ ధర్మాదాయ శాఖలో విలీనం అయిందని ఈఓ బి.వి.మాధవరావు తెలిపారు. ఆలయానికి సంబంధించిన ఆస్తులను ఆయన బుధవారం పరిశీలించారు. సర్వే నంబర్ 84లోని 2.70 ఎకరాలు, 416–3లోని 0.65 ఎకరాలను 15 రోజుల్లో బహిరంగ వేలం వేసి ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు. మొత్తం ఆలయ ప్రాంగణం(కొండ) 14.43 ఎకరాలు విస్తరించి ఉందని తెలిపారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ

వంగర: మండల పరిధి వంగర, మగ్గూరు జంక్షన్ల వద్ద బుధవారం ఎస్ఐ షేక్ శంకర్ వాహన తనిఖీలు చేపట్టారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, ఆటోల్లో వేలాడుతూ ప్రయాణిస్తే వాహనదారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు.

పారిశుధ్య కార్మికులకు పట్టాలివ్వండి



వినతిపత్రాన్ని అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

బొబ్బిలి: పట్టణంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ఇండ్ల పట్టాలివ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, కార్మికులు ఎమ్మెల్యే బేబీనాయనను కోరారు. ఈ మేరకు కోటలో ఎమ్మెల్యే బేబీ నాయనను కలసి వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. పాకి వీధి పక్కనే ఉన్న మున్సిపల్ స్థలంలో ఇండ్ల పట్టాలు ఇవ్వాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పది రోజుల్లో మీ సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. కార్మిక సంఘ నాయకులు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు సమయమిదే..

- 6తో పాటు ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం
- కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



ఆహ్లాదకర వాతావరణంలో వాసుదేవపట్నం ప్రభుత్వ కస్తూర్బా గాంధీ విద్యాలయం

రాజాం: కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో నూతన ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు ప్రారంభించారు. ఆరంభంలో ఈ విద్యాలయాలు బడి బయట ఉన్న బాలికలకు ప్రాథమికోన్నత విద్యను, ఉన్నత విద్యను అందించేందుకు ఏర్పాటు చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ కేజీబీవీల్లో ఇంటర్ విద్యను బలోపేతం చేయడంతో పాటు ఉన్నత విద్యను పేద విద్యార్థినిలకు అందించడంలో సక్సెస్ అయ్యింది. దీంతో ఈ పాఠశాలల్లో సీట్లుకు డిమాండ్ పెరిగింది. ప్రతీ ఏడాది ఆరవ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు తీసుకుంటున్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఆరవ తరగతి, ఇంటర్ ప్రవేశాలతో పాటు ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పుడే దరఖాస్తు చేసుకుంటే సీటు లభించే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

నియోజకవర్గంలో ఇలా..

రాజాం నియోజకవర్గంలో రాజాం మండలం గురవాం, సంతకవిటి మండలంలో వాసుదేవపట్నం, రేగిడి మండలంలో దేవుదళ, వంగర మండలంలో వంగరలో ఈ విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో అన్ని వసతులు ఉండడంతో పాటు పూర్తి స్థాయిలో పక్కా భవనాలు ఏర్పాటు చేశారు. నాడు – నేడుతో మౌలిక వసతులు కల్పించారు. ఫలితంగా ఈ విద్యాలయాల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నెల 22 నుంచి ఈ విద్యాలయాల్లో చేరేందుకు 6వ తరగతితో పాటు ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశాలకు నోటిఫికేషన్ విద్యాశాఖ విడుదల చేసింది. మీ సేవా కేంద్రాలు, సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. విద్యార్థులు విద్యార్హత, కుల, ఆధాయ, ఆధార్ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.

రాజాం నియోజకవర్గంలో కేజీబీవీల్లో సీట్ల వివరాలు

మండలం	తరగతి	సీట్లు
రాజాం	6	40
రాజాం	ఇంటర్	40
రాజాం	7	04
రేగిడి	6	40
రేగిడి	8	01
రేగిడి	ఇంటర్	40
వంగర	6	40
వంగర	ఇంటర్	40
సంతకవిటి	6	40
సంతకవిటి	ఇంటర్	40

ట్రిపుల్ ఐటీకి మంచి అవకాశం

కస్తూర్బా విద్యాలయాల్లో చదివిన విద్యార్థినిలకు ట్రిపుల్ ఐటీ సీట్లు అధికంగా లభిస్తున్నాయి. గత ఐదేళ్లలో అత్యధికంగా ఈ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకే అవకాశం లభించింది. అంతేకాకుండా ఈ పాఠశాలల్లో పది చదివిన విద్యార్థినిలకు అదే విద్యాలయంలో ఇంటర్ చదివేందుకు అవకాశం లభిస్తుంది. ఇతర కళాశాలల్లో చేరిన తరువాత ఉన్నత ఉద్యోగాలు సాధించడంలో ఈ విద్యార్థినిలు సఫలీకృతం అవుతున్నారు.

వీరికి ప్రాధాన్యత

ప్రభుత్వ కేజీబీవీల్లో దరఖాస్తు చేసుకున్న వారిలో పేరెంట్స్ లేని విద్యార్థినిలు, అనాథలు, బడిబయట విద్యార్థినిలకు తొలిప్రాధాన్యత ఇస్తారు. సింగిల్ పేరెంట్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన విద్యార్థినిలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులు అనంతరం ఏప్రిల్ 21న తొలి జాబితా విడుదల చేస్తారు.

డిమాండ్ ఉంది



కేజీబీవీల్లో చేరేందుకు విద్యార్థినిలు అధికంగా ఇష్టపడుతున్నారు. మంచి వసతి, చదువుతో పాటు క్రమశిక్షణ అలవడుతోంది. విద్యార్థినిలు ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు ఇక్కడ మంచి పునాది పడుతోంది. ఆరవ తరగతిలోనే ఈ అవకాశం వస్తుంది. ఈ తరగతి దాటితే మళ్లీ సీటు లభించే అవకాశం లేదు.

– ప్రభావతి, ప్రిన్సిపాల్, కేజీబీవీ, వాసుదేవపట్నం, సంతకవిటి మండలం

చురుగ్గా ఫారం పాండ్‌ల నిర్మాణ పనులు



గోపాలవలసలో ఫారం పాండ్ నిర్మాణ పనులు చేస్తున్న వేతనదారులు

తెర్లాం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లో ఫారం పాండ్‌ల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మండలానికి ఇచ్చిన ఫారం పాండ్‌ల లక్ష్యాలను పూర్తి చేసేందుకు ఎంపీడీఓ రాంబాబు, ఉపాధి ఏపీఓ సుశీల చర్యలు తీసుకున్నారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో కొన్ని రోజులుగా ఫారం పాండ్‌ల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. పలు గ్రామాల్లో జరుగుతున్న పనులను ఏపీఓ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే 70 ఫారం పాండ్‌ల నిర్మాణాలు పూర్తి చేశామని, మిగిలిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సాంకేతిక, క్షేత్ర సహాయకులకు ఇచ్చిన ఫారం పాండ్‌ల నిర్మాణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఏపీఓ సుశీల కోరారు.

'రామకోటి' రాసిన కృష్ణకుమారికి సన్మానం



కృష్ణకుమారిని సన్మానిస్తున్న గ్రామస్తులు

తెర్లాం: శ్రీరామునిపై ఉన్న భక్తితో సుమారు మూడేళ్ల పాటు రామకోటి రాసిన మండలంలోని టెక్కలివలస గ్రామానికి చెందిన మాదుగుల కృష్ణకుమారిని గ్రామస్తులు మంగళవారం రాత్రి ఘనంగా సన్మానించారు. బుధవారం కృష్ణకుమారి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాను ఇంట్లో పనులు చేసుకుంటూ రామకోటి రాయాలనే ఆలోచన వచ్చిందన్నారు. దీంతో 2012 ఏప్రిల్ 17న రామకోటి రాసేందుకు శ్రీకారం చుట్టానని, ఆ శ్రీరాముని కృపతోనే ఎటువంటి ఆటంకం లేకుండా ఇటీవలే రామకోటి రాయడం పూర్తయ్యిందని తెలిపారు. తాను రాసిన రామకోటిని గ్రామంలోని శ్రీరామ మందిరంలో గల శ్రీరాముని పాదాల చెంత పెట్టానని చెప్పారు. గ్రామస్తులంతా కలిసి ఆమెకు పౌర సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం



సారా రహిత గ్రామాలే లక్ష్యంగా పోలీసు, ఎక్సైజ్ అధికారులు పని చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలగాంధీ అన్నారు. రామభద్రపురం తహసీల్దార్ కార్యాలయంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం సారా నిర్మూలన మండల స్థాయి కమిటీ సభ్యులు తహసీల్దార్ సులోచనరాణి, ఎంపీడీఓ రత్నం, ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు, సివిల్ ఎస్ఐ వి.ప్రసాదరావుతో సమావేశమయ్యారు. మండలంలో జోగిందొరవలస గిరిజన గ్రామంలో సారా తయారవుతుందని, ఆ గ్రామాన్ని బి కేటగిరీ జాబితాలో పెట్టడంతో సారా తయారీ నిర్మూలనపై చర్చించారు. సారా తయారు చేసే గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

– రామభద్రపురం

సాదాసీదాగా సామాజిక ప్రజావేదిక



సామాజిక ప్రజావేదికలో ఆడిట్ వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

రాజాం సిటీ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక సాదాసీదాగా జరిగింది. ఉపాధి హామీలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి ఈ ఆడిట్ నిర్వహించారు. గత నెల 8 నుంచి 22 వరకు సామాజిక తనిఖీ బృంద సభ్యులు గ్రామాల్లో చేపట్టిన నివేదికను పరిశీలించారు. సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ మన్మధరావు గ్రామాల వారీగా ఆడిట్ సభ్యులు అందించిన వివరాలను చదివి వినిపించారు. పలు గ్రామాల్లో జరిగిన చిన్నచిన్న పొరపాట్లను గుర్తించి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్‌ల వద్ద వివరణ కోరారు. అంతకుముందుకు ప్రజావేదికకు హాజరైన ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి వేతనదారునికి పనులు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ లావేటి సులోచన, జెడ్‌పీటీసీ బండి నర్సింహులు, ప్రిసైడింగ్ అధికారి వై.పద్మజ, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఏపీడీ ఎం.శ్రీనివాసరావు, డీవీఓ నారాయణరావు, ఉపాధిహామి, హౌసింగ్, పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పదవి కోసం పార్టీ మారలేదా...!

బొబ్బిలి:

వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచి మంత్రి పదవి కోసం టీడీపీలోకి వెళ్లిన ఆర్‌వీ సుజయకృష్ణ రంగారావు ఇప్పుడు నిబద్ధత, నిజాయితీ కోసం మాట్లాడటం ఆశ్చర్యకరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ బొబ్బిలి ఇంచార్జి ముప్వల శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో పాలక వర్గాలను దొంగ రూట్లలో కూటమి ప్రభుత్వం మార్చుకుంటున్న మార్గంలోనే బొబ్బిలిలో కూడా అధికార మార్పు జరుగుతోందని దుయ్యబట్టారు. ఈ విషయం ప్రజలందరికీ తెలుసనీ అన్నారు. కానీ సుజయ్‌కృష్ణ రంగారావు మాత్రం బొబ్బిలి చైర్మన్ సరిగ్గా పని చేయడం లేదని కౌన్సిలర్లు మా వద్దకు వచ్చారని చెప్పడం ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

కోచింగ్ పేరిట తరగతులపై చర్యలకు డిమాండ్

బొబ్బిలి:

సెలవులను కుదించి ప్రవేశాలకు, తరగతులకు ప్రభుత్వం సూచించిన నిబంధనలను కాదని కోచింగ్‌ల పేరుతో తరగతులు నిర్వహిస్తున్న పలు జూనియర్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏపీ విద్యార్థి జేఏసీ ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి 24 వరకూ తరగతులు, అడ్మిషన్లు చేపట్టాలని ఆ తరువాత సెలవులు, అనంతరం జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభించుకోవాలని విద్యాశాఖ నిబంధనలున్నాయన్నారు. కానీ ఇప్పటి నుంచే విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తున్నారని, నిబంధనలను తుంగలో తొక్కుతున్న యాజమాన్యాల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్, రవి, గణేష్,నంద కుమార్ పాల్గొన్నారు.

క్రైస్తవుల నిరసన

బాడంగి: తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన పగడాల ప్రవీణ్‌ను ఎవరో దారి కాచి దాడి చేసి ప్రాణహాని తలపెట్టారని దుండగులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని డొంకినవలస పాస్టర్ స్టీవెన్‌సన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు బుధవారం నిరసన తెలిపారు. కొవ్వూరు చర్చిలో ప్రార్థన ముగించుకొని తిరిగి రాజమండ్రి తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని వారు దారి కాచి దాడి చేసి హతమార్చడం దారుణమన్నారు. వెంటనే దోషులను అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌జెండర్ల కొవ్వొత్తుల ర్యాలీ



బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ట్రాన్స్ జెండర్ల నిరసన ర్యాలీ

బొబ్బిలి: ట్రాన్స్‌జెండర్ అయిన దీపు అనే యువతిని కిరాతకంగా హత్య చేసిన బన్ని అనే యువకుడిని కఠినంగా శిక్షించాలని బొబ్బిలి ట్రాన్స్ జెండర్లు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ చేసి నినాదాలు చేశారు. నిందితుడి చిత్రంతో కూడిన ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ దహనం చేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్ జెండర్లు దుద్దు కృష్ణవేణి తదితరులు విలేకర్లతో మాట్లాడుతూ కాకినాడకు చెందిన బన్ని అనే యువకుడు అనకాపల్లి గవరపాలెంకు చెందిన ట్రాన్స్‌జెండర్ దీపును హత్య చేసి కిరాతకంగా మృతదేహాన్ని ముక్కలుగా చేయడం దారుణమని అన్నారు. పెళ్లి చేసుకుని వేరే ఇంట్లో ఉంటూ హత్య చేయడం అమానుషమన్నారు. గుణశెట్టి సల్మ, గుణశెట్టి స్వాతి, దుద్దు కావ్య, రవళి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ లేక అవస్థలు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస గ్రామ కాలనీ ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీగోడ లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో పాఠశాల ఆవరణలోనే పశువులు, మూగజీవాలు ఆవాసముంటున్నాయి. ఫలితంగా పాఠశాల అపరిశుభ్రంగా మారి ఉదయం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఇబ్బందిగా మారుతుంది. ఈ పాఠశాలకు సంబంధించి గతంలో అనేకసార్లు అధికారులు, పాలకులకు విన్నవించినా ఫలితం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి నిర్లక్ష్యం వల్ల ఇక్కడ చదివే విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదని పేర్కొన్నారు. రోజూ ఉదయం పాఠశాలకు వచ్చే సరికి పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. వీటితో పాఠశాల ఆవరణ దుర్గంధం వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాజీ సైనిక సంక్షేమ పథకాల అమలుకు చర్యలు



డిపెండెంట్ కార్డులు అందజేస్తున్న సైనిక సంక్షేమాధికారి

బొబ్బిలి: మాజీ సైనికుల సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మాజీ సైనికుల సంక్షేమాధికారి కృష్ణారావు అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ మాజీ సైనికులకు చెందిన సుమారు 62 సమస్యలను పరిష్కరించామన్నారు. జిల్లా కేంద్రంలో సీఎస్‌డీ క్యాంటీన్ ఏర్పాటుకు ప్రతిపాదనలను పంపామన్నారు. గౌరవాధ్యక్షుడు మరడ రామినాయుడు, అధ్యక్షుడు రేవళ్ల కిరణ్ కుమార్, ఉపాధ్యక్షుడు రెడ్డి రామకృష్ణ,కోశాధికారి వీఎస్ శర్మ, డిపెండెంట్లు పాల్గొన్నారు.

మహిళలకు స్త్రీ నిధి రుణాల చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

రాజాం: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం రాజాం క్లస్టర్ వెలుగు సంఘాల మహిళలకు రుణ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ నాలుగు మండలాల్లోని 120 సంఘాల్లోని 949 మంది మహిళలకు రూ.8.53 కోట్లు చెక్కు వెలుగు ఏపీ చిరంజీవి లబ్ధిదారులకు అందించారు. స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని అన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రమణమూర్తి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, గురవాన నారాయణరావు, బొత్స వాసునాయుడు, దూబ ధర్మారావు, కిమిడి అశోక్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పూడివలస బాలిక ప్రతిభ

బాడంగి:

మండలంలోని పూడివలస గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాల ఐదో తరగతి విద్యార్థిని మన్నెపు జ్యోత్స్న నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటి ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికైంది. మండలంలోని జ్యోత్స్న ఒక్క విద్యార్థినే కిల్తంపాలెం నవోదయకు ఎంపికవడంతో హెచ్ఎం సీహెచ్ రాము, ఎంఈఓలు లక్ష్మణదొర, రాజేశ్వరి అభినందించారు.



జ్యోత్స్నను అభినందిస్తున్న ఎంఈఓ

సంక్షిప్తంగా...

రుణాలకు 393 దరఖాస్తులు

బాడంగి: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం మండలం నుంచి 393 దరఖాస్తులు వచ్చినట్టు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ చెప్పారు. స్థానిక కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ మండలానికి బీసీ, ఓబీసీ, ఈబీసీ కోటా కింద మొత్తం 71యూనిట్లు మంజూరవ్వగా వీటి కోసం దరఖాస్తు చేసుకోవడానికి మంగళవాం నాటితో గడువు ముగియగా మొత్తం 393 దరఖాస్తులు వచ్చినట్టు చెప్పారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

బాడంగి: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్టు ఎంఈఓలు లక్ష్మణదొర, రాజేశ్వరి చెప్పారు. స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో బుధవారం మాట్లాడుతూ మండలంలోని బాడంగి హైస్కూల్, గురుకుల పాఠశాల, రేజేరు హైస్కూల్ పరీక్ష కేంద్రంగా పరీక్షలు జరుగుతున్నాయన్నారు.

వన్నలిలో చలివేంద్రం

రేగిడి : మండలంలోని వన్నలి గ్రామంలో ప్రధాన రహదారి పక్కన చలివేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. సత్యసాయి భజన మండలి యూత్ ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రయాణికులు చలివేంద్రం వద్ద దాహార్తి తీర్చుకోవాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నంలోని కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్ఓ అనుగోలు ప్రభ బుధవారం తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 11 చివరి తేది అని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు కో ఆప్షన్ సభ్యుని ఎంపిక

సంతకవిటి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు కో ఆప్షన్ సభ్యుని ఎంపిక నేపథ్యంలో ప్రత్యేక సమావేశం ఉంటుందని ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్ తెలిపారు. సమావేశానికి ప్రాదేశిక సభ్యులు హాజరు కావాలని కోరారు.

తెర్లాంలో కంటి వైద్య శిబిరం



శిబిరంలో రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ జాక్సన్

తెర్లాం: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 35మంది కంటి రోగులను శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. తెర్లాంతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి 85మంది వివిధ రకాల కంటి రోగులు వైద్య శిబిరానికి హాజరయ్యారు. వీరిలో 35మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి క్యాంపు జూనియర్ మేనేజర్ సాయికుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కందుల శ్రీనివాసరావు, వరదా నాగేశ్వరరావు, వజ్రపు భాస్కరరావు తదితరులు సేవలందించారు.

గ్రామాల్లో పరిశుభ్రత

రేగిడి: గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కాలువల్లో పూడికలు తీయించడం, రోడ్లను పరిశుభ్రం చేయించడం వంటి పనులను బుధవారం చేపట్టారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా చెత్తను ఆరుబయటకు తరలిస్తున్నారు. వన్నలి, అంబకండి, ఉనుకూరు, చిన్నశిర్లాం, బూరాడ తదితర గ్రామాల్లో శనివారం కాలువల్లో పూడికలు తీయించే కార్యక్రమాలు చేపట్టారు.

అకాల వర్షంతో రైతుకు నష్టం

రేగిడి: మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షంతో పాటు ఈదురుగాలులు కారణంగా మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. పంట చేతికొచ్చిన సమయంలో గాలులకు నేలకొరిగి కండెలు పాడయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాటిపాడు, లచ్చనవలస, బూరాడ తదితర గ్రామాల్లో ఈ పంటకు భారీగా నష్టం వాటిల్లిందని రైతులు పేర్కొన్నారు.

ఘనంగా ఎక్కలదేవతమ్మ పండగ

రాజాం: మండలంలోని పొగిరి గ్రామంలో ఎక్కలదేవతమ్మ పండగ బుధవారం వైభవంగా జరిగింది. దేవతమ్మ ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు చేరుకుని ఉపాసం చెల్లించడంతో పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన వినోద సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

సోలార్ విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బొబ్బిలి రూరల్: సోలార్ విద్యుత్‌ను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈపీడీసీఎల్ ఏఈ విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని ఎం బూర్జివలసలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సూర్యఘర్ పథకం వివరాలను, సబ్సిడీ వినియోగం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జేఎల్ఎం, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.